"మీరు వచ్చి అరగంటైనా కాలేదు....అప్పుడే ఆఫీసొదిలి వెళ్ళి పోతానంటే ఎలాగయ్యా? పోనీ మ్యాట్నీకి వెళ్ళకూడదూ?" అన్నాడు చేతులు నులుపుకుంటూ.

"అమ్మబాబోయ్....అందాకా ఆగలేము సార్....మేము ఇప్పుడే వెళ్తాం పదరా సీతారాం" అన్నాడు ఆత్మారాం.

"పోనీ మార్నింగ్ షో అయ్యాక వస్తారా? ప్లీజ్ రారూ....మంచోళ్ళకదా?....రారూ...." అన్నాడు చాముండేశ్వరరావు ఇద్దరి బుగ్గలమీదా చిటికెలు వేస్తూ.




సీతారాం, ఆత్మారాం మళ్ళీ మొహమొహాలు చూస్కుని ఘొల్లున నవ్వారు.

"మేము వస్తే మాత్రం మీకేంటి సార్ ప్రయోజనం?...." అన్నాడు ఆత్మారాం.

"ఏదో కొంతైనా పని జరుగుతుంది కదా!...."

"పనా!....జరగడమా! —"

ఇద్దరూ మళ్ళీ ఘొల్లున నవ్వారు.

"ఏం? ...బిక్కమొహం వేశాడు చాముండేశ్వరరావు.

"ఆఫీసుకొచ్చినా టేబులుమీద తలెట్టుకుని నిద్రపోవడమేగా" అన్నారు ఇద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ.

ఇంతలో ప్యూను వీరప్ప అక్కడికి వచ్చాడు.

"అయ్యా ఆత్మారాంగారూ—ఈ ఆదివారం కాస్సేపు టేబులుమీద పెట్టి నిద్దరోడానికి ఆఫీసుకు రమ్మని మీకు చెప్పమన్నారు పెద్దాఫీసరు గారు...." అన్నాడు వీరప్ప.

"ఏంటి....టర్న్ డ్యూటీకి రమ్మంటున్నారా?....అలాగే కానీ.... ప్రతిసారి కాస్సేపు నిద్రపోవాలంటే బోరు కొడ్తుంది ఈ ఆదివారం వార పత్రికలూ, నవలూ తెచ్చుకుని చదువుకుంటానని పెద్దాఫీసరుగార్తో చెప్పు...." విసుక్కుంటూ అన్నాడు ఆత్మారాం.

"ఏమోనండి బాబూ....ఆయన నిద్దరోమన్నారు అదే మీకు చెప్పాను....మీరు కథలు చదువుకుంటానంటే ఆ విషయం స్వయంగా మీరే ఆయన్తో మాట్లాడండి....లేపోతే ఆయన్నన్ను తిడ్తారు...." చెప్పి వెళ్ళిపోయాడు వీరప్ప.

ఆత్మారాం పెద్దాఫీసరు గదివైపు రెండడుగులు వేశాడు. సీతారాం చటుక్కున అతని చేయి పట్టుకున్నాడు.

"ఇప్పుడాయన దగ్గరికెందుకు?....వెళ్తేతే ఒహ పట్టాన వదల్డు.... పెండింగ్ వర్కు గురించీ, అర్జంటు ఫైళ్ళ గురించి అడుగుతాడు....సిని మాకి లైమైపోయింది. మనం సినిమా నుండి వచ్చాక చెపుదువుగాని...."

"సరేలే...." అన్నాడు ఆత్మారాం.

"సార్ ఇహ మేము వెళ్తొస్తాం....పెద్దాఫీసరుగారు ఎప్పుడడిగినా ఇప్పుడే పనిమీద పక్క డిపార్టుమెంటుకి వెళ్ళామని చెప్పండి" అన్నాడు సీతారాం.

చాముండేశ్వరరావు నొసలుమీద అరచేత్తో కొట్టుకుంటూ "అలాగే. అంతకంటే ఏం భాగ్యం?" అన్నాడు సంబరంగా.

ఇద్దరూ గుమ్మంపైపు రెండడుగలు వేశారో లేదో వాళ్ళకి ఇద్దరు పార్టీలు తగిలారు. వాళ్ళని చూస్తూనే సీతారాం, ఆత్మారాం ముఖాలు వికసించాయి.

గబగబా వచ్చి వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చున్నారు.

మొదటి పార్టి ఆత్మారాం దగ్గరికొచ్చాడు.

"హిహిహి...." అన్నాడు.

"మీ నవ్వులు చూసి మేం అయిసయిపోంగా...." అన్నాడు ఆత్మారాం....

"తెల్సండీ హి హి...." అన్నాడు అతను.

"మరి తెచ్చావా?"....

"లేదండీ....పనయ్యాక ఇస్తాను"

ఆత్మారాం ఆశ్చర్యంగా అతనివంక చూసాడు.

"నువ్వెప్పుడూ గవర్నమెంటు ఆఫీసుకు రాలేదా?...."

అతను అమాయకంగా తల అడ్డంగా ఊపాడు.

"ఇదే మొదటిసారా!"

అవునన్నట్లు తల నిలువుగా ఊపాడు.

"అదీ సంగతి....ముందే డబ్బివ్వకుండా పనెలా జరుగుతుందయ్యా?...."

"పనవ్వగానే డబ్బులిస్తానండి.... ప్లీజ్ సార్" మీరు ఫైలు

ప్లటప్ చేసి మాకు ఫావరబుల్‌గా రాసి చాముండేశ్వరరావుగారికివ్వండి. ఆయన రికమెండ్‌చేస్తూ సంతకం పెట్టి పెద్దాఫీసరుగార్కి పంపిస్తారు. పెద్దాఫీసరుగారు 'యస్' అంటారు....మీవల్లే ఆగిపోయింది...." బ్రతిమాలాడు అతను.

"పెద్దాఫీసరుగారికి 'యస్' అనడానికి డబ్బులిచ్చావా?—" ఆత్మారాం అడిగాడు.

"ఇచ్చానండి..." వినయంగా తలూపాడు అతను.

"మరి చాముండేశ్వరరావుగార్కి?"

"ఆయనకీ ఇచ్చానండీ...."

"వాళ్ళిదరూ గొప్పోళ్ల మేమే ఎందుకు పనికి రానోళ్ళం అవునా?"
"ఎంత మాటండి?....అలాగని నేనన్నానా సార్...."

"అలాగని వేరేగా అనాలా!" వాళ్ళకేమో ముందే డబ్బులిచ్చేస్తావ్ మమ్మల్నేమో పనయ్యేదాకా ఆగమంటావ్?....మేమేమన్నా బిచ్చగాళ్ళలా కనిపిస్తున్నామా?" సీరియస్‌గా అడిగాడు ఆత్మారాం.

"అమ్మమ్మా....ఎంతమాట? ఈవేళ డబ్బులు తీసుకురాలేదండీ.... రేపు తప్పకుండా తెచ్చిస్తాను"

"అయితే రేపేరండి...."

"రేపు ఎల్లుండి ఆఫీసుకు శలవు కదండీ" అన్నాడతను.

"మరి రేపు తెచ్చిస్తానని ఎలా చెప్పారు?....మీతో కుదిరే బేరం కాదుగానీ—మీరు డబ్బులు తెచ్చినప్పుడే రండి....వస్తా...." అంటూ సీట్లోంచి చివాలున లేచాడు ఆత్మారాం.

"అదే సమయంలో సీతారాం ముందు కూర్చుని వున్న పార్టీ నవ్వుతూ లేచాడు.

స.వ. బ్రౌన గ్రంథాలయము, ...
నవ్వితే నవ్ రత్నాలు-2 ప్రవేశ సంఖ్య 21982 ... 15
తేది...

"పదవోయ్ సినిమాకి వెళ్దాం....వీళ్ళతో మనకి బేరం కుదర్దు...." అన్నాడు ఆత్మారాం సీతారాంతో.

"నాకు బేరం కుదిరింది...." సీతారాంముసిముసి నవ్వులునవ్వుతూ సమాధానం చెప్పాడు.

"అయితే నువ్వు సినిమాకు రావా?" అడిగాడు ఆత్మారాం.

"రాను నేను పంజేసుకుంటా....నువ్వెళ్ళు .." అన్నాడు సీతారాం.

ఆత్మారాం ఒక్కడే సినిమాకి వెళ్ళాడు.

హాలు దగ్గర అదే ఆఫీసుకి చెందిన వేరే డిపార్టుమెంట్సు వాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళంతరూ ఆత్మారాంని చూసి సంతోషంగా చెయ్యూపారు.

"ఓ....మీరంతా కూడా సినిమాకి వచ్చేసారే!!...." అన్నాడు ఆత్మారాం.

"ఆ....మాకు బేరాలేమీ తగల్లేదు...." అన్నారు వాళ్ళు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి.

సీతారాంకి, ఆత్మారాంకి ప్రమోషనులు వచ్చి ఆఫీసర్లు అయ్యారు. ఇప్పుడు వాళ్ళకింద పనిచేసే క్లర్కులు అటెండెన్సు రిజిస్టర్లో సంతకం పెట్టేసి సినిమాలకి చెక్కేస్తున్నారు.

సీతారాం, ఆత్మారాం తలకాయలు కొట్టుకుంటూ సీట్లలోనే కూర్చుంటున్నారు.

✻